సాక్షి
సూర్యాపేట
ఆదివారం | 16 | జూలై | 2023



ఉపా చట్టాన్ని రద్దుచేయాలి
ఉపా చట్టాన్ని రద్దుచేయాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉదయగిరి డిమాండ్ చేశారు.
- 8లో



విద్యతోనే సమాజాభివృద్ధి
విద్యతోనే సమాజం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు.
- 10లో

గరిష్ఠం/కనిష్ఠం
30°/25°
వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ ఈదురు గాలులతో చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కోదాడ డీఎస్పీ వెంకటేశ్వర్‌రెడ్డి బదిలీ

- కొత్త డీఎస్పీగా ప్రకాశ్ నియామకం

కోదాడ: కోదాడ సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ (డీఎస్పీ)గా పనిచేస్తున్న జి.వెంకటేశ్వర్‌రెడ్డిని శనివారం డీజీపీ బదిలీ చేశారు. ఆయనకు ప్రస్తుతం ఎక్కడ పోస్టింగ్ ఇవ్వకుండా డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించారు. ఆయన స్థానంలో కోదాడ డీఎస్పీగా బి.ప్రకాశ్‌ను నియమించారు. వెంకటేశ్వర్‌రెడ్డి కోదాడ డీఎస్పీగా రెండున్నర సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఆయనను బదిలీ చేసినట్లు తెలిసింది. నూతన డీఎస్పీ ప్రకాశ్ సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఫైలేరియాపై ప్రజలకు అవగాహన అవసరం




ఫైలేరియా బాధితులకు సామగ్రి అందజేస్తున్న వైద్యులు

కోదాడరూరల్ : బోదకాలు వ్యాధి (ఫైలేరియా)పై ప్రజలు అవగాహన కలిగి ఉండడం చాలా అవసరమని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ సాహితీ అన్నారు. శనివారం కోదాడ మండలం కాపుగల్లు పీహెచ్‌సీలో బోద వ్యాధి గ్రస్తులకు బకెట్లు, మగ్గులతో పాటు ఏడు వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోద వ్యాధిని నివారించాలంటే దోమలు కుట్టకుండా పుట్టకుండా చూసుకోవాలన్నారు. ఈ వ్యాధి ఓసారి వస్తే జీవితంలో తగ్గే అవకాశాలు చాలా తక్కువని, అందుకే ప్రతిఒక్కరూ ముందు జాగ్రత్తగా డీఈసీ మాత్రలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నిరంజన్, జిల్లా ఆసంక్రమిత వ్యాధుల అధికారి డాక్టర్ కల్యాణ్‌చక్రవర్తి, షాబుద్దీన్, శ్రీనివాస్, విజయలక్ష్మి, రూప, పద్మ, చంద్రకళ, సుధా ఉన్నారు.

25న వ్యక్తిత్వ వికాస కథల పోటీలు

భానుపురి (సూర్యాపేట): బాలబాలికల్లో కుంటుపడుతున్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ధార్మిక, ఆధ్యాత్మిక, నైతిక, మానవతా విలువలను పెంపొందించాలనే సదుద్దేశంతో తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీన జిల్లాస్థాయిలో వ్యక్తిత్వ వికాస కథల పోటీలు నిర్వహిస్తున్నట్లు హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ సేవ్య నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కథ చెబుతారా ఊకొడతారా పేరుతో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో విద్యార్థులు భారతం, భాగవతం, రామాయణం, పంచతంత్ర, చారిత్రక కథల్లో ఏదైనా ఒక అంశంపై సంక్షిప్త ఉపన్యాసం (ఐదు నిమిషాలకు మించకుండా) చెప్పవలసి ఉంటుందన్నారు. పోటీలు జూనియర్, సీనియర్ రెండు విభాగాలుగా నిర్వహించబడతాయని తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.1000 నగదు, ద్వితీయ బహుమతిగా రూ.750, తృతీయ బహుమతి రూ.500 చొప్పున నగదు తిరుమల తిరుపతి దేవస్థానం వారు అందిస్తారని పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని భగవద్గీత మందిరంలో జరిగే ఈ పోటీల్లో పాల్గొనదలిచే బాలబాలికల పేర్లను ఈ నెల 20వ తేదీలోగా సెల్: 9824827 49022 నంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపాలని ఆయన కోరారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో కోదాడకు మొదటి స్థానం



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శిరీషా

కోదాడ: స్వచ్ఛ సర్వేక్షణ్–2023 సర్వేలో తెలంగాణ రాష్ట్రంలోనే కోదాడ మున్సిపాలిటీ మొదటి స్థానంలో నిలవడం గర్వకారణమని మున్సిపల్ చైర్‌పర్సన్ వనపర్తి శిరీష అన్నారు. శనివారం కోదాడ మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛ సర్వేక్షణ్–2023 సర్వే కార్యక్రమంపై అధికారులు, సిబ్బందితో జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో కోదాడ మున్సిపాలిటీ ముందు నిలవడానికి పారిశుద్ధ్య సిబ్బంది, అధికారులు, సిబ్బంది, రిసోర్స్ పర్సన్లకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. మరికొంత కాలం ఇదే నిబద్ధతతో పని చేయాలని, కోదాడను అన్నిరంగాల్లో మొదటి స్థానంలో నిలపాలని కోరారు. ఈ సమావేశంలో కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, పార పీరయ్య, వెంకన్న, భవాని, సిబ్బంది, ఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్ష సాయం ఆలస్యం!

- శనివారం నుంచి బీసీలకు పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటన
- బడ్జెట్‌లేని కారణంగా ఖాతాల్లో జమచేయని అధికారులు
- మొదటి విడతలో నియోజకవర్గానికి 300 మందికి చాన్స్!
- నిధులు విడుదలైతే లబ్ధిదారులను ఎంపిక చేసే అవకాశం



దరఖాస్తులు అందజేస్తున్న కులవృత్తిదారులు (ఫైల్)

బడ్జెట్ రాగానే లబ్ధిదారులను ఎంపిక చేస్తాం

రూ.లక్ష ఆర్థికసాయం దరఖాస్తుల పరిశీలన పూర్తయింది. మొదటి విడతలో నియోజకవర్గానికి 300 మంది చొప్పున రుణ సాయం చేయాలని ప్రభుత్వం సూచనప్రాయంగా తెలిపింది. ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేయగానే జిల్లాలో ఇప్పటికే గుర్తించిన అర్హుల నుంచి జిల్లా కమిటీ సభ్యులు మొదటి విడత లబ్ధిదారులను ఎంపిక చేస్తారు.

– ఎస్టేర్, బీసీ అభివృద్ధి శాఖ జిల్లా అధికారి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): బీసీ కులవృత్తిదారులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష ఆర్థికసాయం పంపిణీ ఆలస్యమయ్యేలా కనిపిస్తోంది. మొదటి విడతలో భాగంగా నియోజకవర్గానికి 300 మంది చొప్పున రూ.లక్ష ఆర్థికసాయం అందించాలని తాజాగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ ప్రకారంగా జిల్లా అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో బీసీ సంక్షేమ శాఖ మంత్రి, ఆ శాఖ ఉన్నతాధికారులు వెల్లడించారు. అయితే ఇప్పటికే ఎంపిక చేసిన లబ్ధిదారుల ఖాతాల్లో శనివారం నుంచి జమ చేస్తామని ప్రకటించినా.. బడ్జెట్ విడుదల చేయని కారణంగా మరో రెండు, మూడు రోజుల సమయం పట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

వివరాలు ఇలా..

మండలాల సంఖ్య	మున్సిపాలిటీలు
23	05
దరఖాస్తుల సంఖ్య	**గుర్తించిన అర్హులు**
23,374	17,985

జిల్లా వ్యాప్తంగా అర్హుల గుర్తింపు

జిల్లాలోని 4 నియోజకవర్గాల పరిధిలోని 23 మండలాలు, 5 మున్సిపాలిటీల్లో 23,374 మంది నుంచి దరఖాస్తులుగా రాగా పరిశీలించిన అధికారులు అందులో 17,985 మందిని అర్హులుగా గుర్తించారు. కాగా మొదటి విడతలో నియోజకవర్గానికి 300 కుటుంబాల లెక్కన లబ్ధిదారులుగా గుర్తిస్తున్నారు. ఈ లెక్కన సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో 1,200 కుటుంబాలకు రూ.లక్ష సాయం చొప్పున మొత్తం రూ.12 కోట్లు అందించనున్నారు. అయితే ఒక్కో మున్సిపాలిటీ, మండలం నుంచి 30 మందిలోపే లబ్ధిదారులు ఉండబోతున్నారు. తొలి విడత అర్హుల వివరాలను ఈనెల 15న తేలాల్సి ఉన్నా.. ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేయని కారణంగా ఎంపిక చేయలేదని సమాచారం.

అత్యంత నిరుపేదలకు సాయం అందేలా..

ఈ పథకం కింద బీసీల్లోని కుల వృత్తులు చేసుకునే వారిలో అత్యంత నిరుపేద కుటుంబాలకే ప్రభుత్వం సాయం అందించనుంది. ఆ మేరకు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థుల స్థితిగతులను గ్రామాల్లో పరిశీలించారు. గడచిన ఐదేళ్ల కాలంలో రూ.50 వేలకు పైబడి ఎవరైనా ఆర్థికసాయం పొందారా లేదా అనే విషయాన్ని పరిశీలించారు. రూ.లక్ష ఆర్థికసాయం అందజేయడంలో ప్రభుత్వం అత్యంత నిరుపేదలు, దివ్యాంగులు, వితంతువులు నుంచి అర్హులను ఎంపిక చేసే సాయం అందించేందుకు ప్రాధాన్యం ఇచ్చింది. జిల్లాలో ఐదేళ్లలో ఎలాంటి పథకాల్లో లబ్ధిపొందని వారిని ప్రస్తుత పథకానికి తొలి విడత లబ్ధిదారులుగా గుర్తించినట్లు తెలుస్తోంది.

భగీరథ.. కార్మికుల వ్యథ

- అరకొర వేతనాలతో మిషన్ భగీరథ కార్మికుల కష్టాలు
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్ట్ సంస్థలు
- మంజూరయ్యే జీతంలో సగమే అందజేత
- అవి కూడా నాలుగు నెలలుగా ఇవ్వట్లే..
- కుటుంబాలు గడవక బలవన్మరణానికి పాల్పడుతున్న కార్మికులు



వేతనాలు చెల్లించాలని ఎస్‌ఈకి వినతిపత్రం ఇస్తున్న కార్మిక సంఘం నాయకులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ప్రజలకు సురక్షిత తాగునీటిని అందిస్తున్న మిషన్ భగీరథ కార్మికుల కష్టాల కడలిలో జీవనం సాగిస్తున్నారు. కాంట్రాక్టు సంస్థలు నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోగా, ప్రభుత్వం ఇచ్చే వేతనంలోనూ సగం ఆయా సంస్థలు దోచుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. కాంట్రాక్టు సంస్థల నిర్లక్ష్యం వల్ల ఆర్థిక ఇబ్బందులతో తాము ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని వాపోతున్నారు. మిషన్ భగీరథ లో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్న పుష్పలత అనారోగ్యానికి గురై.. వైద్యం చేయించుకునేందుకు డబ్బులు లేక, కుటుంబ పోషణ భారమై రెండు రోజుల కిందట ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. మిషన్ భగీరథలోనే పనిచేసిన ఆమె భర్త మహేశ్ కూడా ఏడాది కిందటే కుటుంబ పోషణ భారమై, ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడిన ఘటనను ఆమె ప్రస్తావించారు. మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మికుల దీన స్థితికి అద్దం పడుతోంది.

నాలుగు నెలలుగా అందని వేతనాలు..

ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా మిషన్ భగీరథలో జీవీపీఆర్, రాఘవ, మెగా, సీయాన్, ఐహెచ్‌పీ, సీహెచ్‌వీవీ కంపెనీలు పనులు చేస్తున్నాయి. వాటి ఆధ్వర్యంలోనే మిషన్ భగీరథ పనులు జరిగాయి. పదేళ్ల పాటు నిర్వహణ బాధ్యత కూడా ఆయా సంస్థలదే. నీటి సరఫరా కూడా అవే చూసుకోవాలి. ఆయా సంస్థల్లో ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 2 వేల మంది కార్మికులు పని చేస్తున్నారు. సూపర్‌వైజర్లు, లైన్‌మెన్లు, పంపు ఆపరేటర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, వాచ్‌మెన్లు, ఫిట్టర్లు, వెల్డర్లు, గార్డెనర్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. వారికి ఆ సంస్థ మినహా మిగతా సంస్థలు నాలుగు నెలలకు పైగా వేతనాలను ఇవ్వక పోవడంతో కార్మికులంతా అవస్థలు పడుతున్నారు.

సగం జీతం కూడా ఇవ్వని సంస్థలు..

మిషన్ భగీరథలో పని చేసే కార్మికులకు ప్రభుత్వం నెలకు రూ.19,500 చొప్పున కంపెనీలకు చెల్లిస్తోంది. అయితే కంపెనీలు మాత్రం కేటగిరీని బట్టి నెలకు రూ.9,500 నుంచి రూ.12వేల లోపే కార్మికులకు చెల్లిస్తున్నాయి. వాస్తవంగా ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయం కల్పించడంతోపాటు కింది స్థాయి కార్మికులకు కనీసం రూ.15,600 చెల్లించాలని కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి. అయినా రూ.9,500 మాత్రమే ఇస్తూ సంస్థలు చేతులు దులుపుకుంటున్నాయి.

నెరుగా వేతనాలు ఇవ్వాలి



మిషన్ భగీరథ కార్మికులకు ప్రభుత్వం నేరుగా వేతనాలు ఇవ్వాలి. ప్రస్తుతం ఉన్న వేతనాలను పెంచాలి. పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించాలి. కాంట్రాక్టర్ల ద్వారా వేతనాలు చెల్లించడం వల్ల కార్మికులు నష్టపోతున్నాం. చాలీచాలని వేతనాలతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఈ విషయంలో ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలి.

– బత్తుల వెంకటేశం, మిషన్ భగీరథ కాంట్రాక్టు కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు

ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాలేవీ?


ఒకటి రెండు సంస్థలు మినహా మిగతా సంస్థలు కార్మికులకు చెల్లించే వేతనాల్లో పీఎఫ్ చెల్లింపుల కోసం కోత విధించినా, వారి ఖాతాల్లో జమ చేయడం లేదని కార్మికులు ఆరోపిస్తున్నారు. ఈఎస్ఐ సదుపాయాన్ని కూడా కల్పించడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న పుష్పలతకు కూడా ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయం లేదని, అవి ఉంటే మెరుగైన వైద్యం అందేదని కార్మిక సంఘాలు చెబుతున్నాయి.

కాంట్రాక్టు సంస్థల ఇష్టారాజ్యం

కార్మికులకు వేతనాలు చెల్లించే విషయంలో కాంట్రాక్టు సంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని కార్మిక సంఘాలు చెబుతున్నాయి. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కాంట్రాక్టు సంస్థలు సరిగ్గా వేతనాలను ఇవ్వకపోగా, సదుపాయాలు కల్పించడం లేదని కార్మికులు పేర్కొంటున్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధనకు పోరాడాలి

భానుపురి (సూర్యాపేట): ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఐక్యంగా పోరాడాలని టీ ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు తప్పెట్ల శ్రీరాములు మాదిగ అన్నారు. శనివారం ఆయన నివాసంలో టీఎంఆర్‌పీఎస్ సూర్యాపేట పట్టణ అధ్యక్షుడిగా పిడమర్తి మధు మాదిగ, పెన్‌పహాడ్ మండల అధ్యక్షుడిగా ఒగ్గు రవి మాదిగ, మండల ప్రధాన కార్యదర్శిగా కొండేటి సందీప్ మాదిగను నియమించి వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టే వరకు బీజేపీ ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమవ్వాలన్నారు. సమితి జిల్లా అధ్యక్షుడు పుట్టల ప్రవీణ్ కుమార్ మాదిగ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు మల్లూసార్ మాదిగ, టీఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మీసాల శివరామకృష్ణ మాదిగ, జిల్లా నాయకులు వల్లాస రవి మాదిగ, చివ్వెంల మండల అధ్యక్షుడు ఎడవెల్లి రాము, జిల్లా కార్యదర్శి పల్లాపు శంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు పాతకోట్ల రమేష్, సూరారపు నాగయ్య, బొమ్మ మంగయ్య, కుసుమ లై సైదులు, నల్లగొండ ఆరుణ్, ములకలపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందిస్తున్న తప్పెట్ల శ్రీరాములు

న్యాయ వ్యవస్థపై అవగాహన కలిగి ఉండాలి



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి శ్రీవాణి, చిత్రంలో న్యాయవాదులు, ప్రెస్ క్లబ్ సభ్యులు

- జిల్లా సీనియర్ సివిల్ జడ్జి శ్రీవాణి

ఆత్మకూర్ (ఎస్): ప్రతిఒక్కరూ న్యాయవ్యవస్థపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ పి.శ్రీవాణి అన్నారు. శనివారం ఆత్మకూర్ (ఎస్) మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో లీగల్ సర్వీస్ అథారిటీ, ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలు న్యాయస్థానాలు, చట్టాలపై అవగాహన కలిగినప్పుడే నేరాల సంఖ్య తగ్గుముఖం పడుతుందన్నారు. మనిషి జీవన విధానంలో పలు మార్పులు వస్తున్న ప్రస్తుత రోజుల్లో నేరాల సంఖ్య పెరుగుతుందని, వాటిని అరికట్టడానికి న్యాయవ్యవస్థ ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తప్పుచేసే ఎవరైనా చట్టం నుంచి తప్పించుకోలేరన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మర్ల స్వర్ణలత చంద్రారెడ్డి, తహసీల్దార్ పుష్ప, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొండ్రాల అశోక్, సెక్రటరీ పోటిపోయిన నర్సయ్యయాదవ్, లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ సత్యనారాయణపిళ్ళే, డీఎల్ఎస్ఏ మెంబర్స్ శరద్, మాధవ్‌రెడ్డి వెంకన్న, ఏడింద్ల అశోక్, వద్దుల, బొల్లెద్దు వెంకటరత్నం, పట్టిపెల్లి ప్రవీణ్, వాణి, సీనియర్ న్యాయవాదులు గుంటూరు మధు, తల్లమల్ల హస్సేన్, దండా వెంకటరెడ్డి, ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ గురునదమ్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మాటేటి రాములు, మల్లేష్, జానయ్య, సైదులు, కృష్ణ, వెంకటగిరి రాము తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

- జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జా దీపిక



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జా దీపిక

మోతె: తెలంగాణలో సీఎం కేసీఆర్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గుజ్జా దీపిక అన్నారు. శనివారం మోతె మండల కేంద్రంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ముప్పాని ఆశ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అనంతరం సభలో పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని అందోళన చేశారు. పలు సమస్యలపై సర్పంచులు, ఎంపీటీసీలు మూకుమ్మడిగా సంబంధిత శాఖల అధికారులను నిలదీశారు. ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది గ్రామాల్లో పర్యవేక్షణ కరువైందని సభ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ మైనంపాటి సునీత, జెడ్పీటీసీ పందిళ్లపల్లి పుల్లారావు, ఎంపీడీఓ వెంకటాచారి, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలుతోనే దళితుల అభివృద్ధి

- మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు మేక వెంకన్న




సమావేశంలో మాట్లాడుతున్న మేక వెంకన్న

భానుపురి (సూర్యాపేట): దళితులు అభివృద్ధి చెందాలంటే ఎస్సీ వర్గీకరణ పరిష్కారం కాదని, సంక్షేమ పథకాల అమలుతోనే సాధ్యమని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు మేక వెంకన్న అన్నారు. శనివారం సూర్యాపేటలో మాల మహానాడు జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నిక సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీ అధ్యక్షుడిగా వల్లమల్ల ప్రకాష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మద్దూరి కుమార్, గౌరవ అధ్యక్షుడిగా అనుముల రాజకృష్ణ, ఉపాధ్యక్షులుగా కూరపాటి ప్రభు, చందా దశరథ, ప్రధాన కార్యదర్శిగా బొప్పని రవి, పట్టణ మహిళా అధ్యక్షురాలుగా చింతపల్లి జ్యోతి, సూర్యాపేట నియోజకవర్గం అధ్యక్షుడిగా పోతురాజు రాంబాబు, జిల్లా యువజన అధ్యక్షుడిగా కోదాడ రాంబాబు, కార్యదర్శులుగా బొల్లెద్దు వెంకటేశ్వర్లు, బొల్లెద్దు మహేందర్, దీకొల్ల రాంబాబులను ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీలకు 20 శాతం రిజర్వేషన్‌తోపాటు ప్రైవేట్‌లో రిజర్వేషన్ల అమలుకు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పిట్టల భాగ్యమ్మ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు ఎల్ల మక్కులుల, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పౌరసేవలు వేగంగా అందేలా..

ప్రతి మున్సిపాలిటీలో సిటిజన్ సెంటర్ ఏర్పాటు

- ఇప్పటికే బల్దీ, స్వచ్ఛత యాప్‌లకు రూపకల్పన
- 17 విభాగాల్లో ఫిర్యాదులు చేసుకునే అవకాశం
- యాప్‌ల్లో దరఖాస్తు చేయలేనివారు నేరుగా సెంటర్‌కు వెళ్లేలా వెసులుబాటు



తిరుమలగిరి మున్సిపాలిటీలో దరఖాస్తులు స్వీకరిస్తున్న సిబ్బంది

పారదర్శకత ఉంటుంది



సిటిజన్ సెంటర్ల ఏర్పాటు చేయడం వల్ల మున్సిపాలిటీల్లో సమస్యలు వేగంగా పరిష్కరించబడతాయి. పాలనలో పారదర్శకత, ఉద్యోగుల్లో జవాబుదారీతనం పెరుగుతుంది. మెరుగైన పౌరసేవలు అందించడానికి అవకాశం ఉంటుంది. దరఖాస్తు అందించిన ఏడు రోజుల్లోనే సమస్యలు పరిష్కరించబడతాయి.

– దండు శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్, తిరుమలగిరి

తిరుమలగిరి (తుంగతుర్తి): మున్సిపాలిటీల్లో పౌరసేవలు వేగంగా అందించేందుకు పురపాలక శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇందుకు ప్రతి మున్సిపాలిటీలో ప్రత్యేకంగా సిటిజన్ సెంటర్లు ఏర్పాటు చేసింది. ఇదివరకు ప్రజలు ఈ సెంటర్‌లో నేరుగా దరఖాస్తు చేసుకుని పౌరసేవలను పొందేవారు. విభిన్న సమస్యలపై కూడా ఇక్కడే ఫిర్యాదులు చేయొచ్చు. ఈ సెంటర్ సేవలను మున్సిపల్ కార్యాలయం పనివేళల్లో ప్రజలు ఉపయోగించుకునే వీలుంది. ఇక్కడ ఇచ్చిన ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్ చేస్తారు.

ఇప్పటికే రెండు యాప్‌లు అందుబాటులోకి..

మున్సిపాలిటీల్లో పౌరసేవలు అందించేందుకు మున్సిపల్ శాఖ ఇప్పటికే సిటిజన్ బల్దీ, స్వచ్ఛత యాప్‌లను రూపొందించింది. ఈ యాప్‌లను ప్రజలు వినియోగించుకునేలా సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. స్మార్ట్‌ఫోన్ ఉన్నవారు ప్లే స్టోర్ ద్వారా ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని సంబంధిత సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చు. అలాగే పలు రకాల సేవలు పొందేందుకు దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం 17 అంశాలకు సంబంధించి యాప్‌లో విభాగాలు కనిపిస్తాయి. ఆయా విభాగాల్లో తమకు సంబంధించిన దాన్ని ఎంచుకొని దానిలో పౌరసేవలకు దరఖాస్తు చేయడం తోపాటు సమస్యలపై కూడా ఫిర్యాదు చేయవచ్చు. యాప్ ద్వారా ఫిర్యాదులు రాగానే ఆయా అధికారులతోపాటు దరఖాస్తుదారుని సెల్‌ఫోన్‌కు సంక్షిప్త సమాచారం వెళ్తుంది. గ్రీవెన్స్ నంబర్ ఆధారంగా ఆ దరఖాస్తు పరిష్కారం అయ్యిందో లేదో తెలుసుకునే వెసులుబాటు కూడా ఉంటుంది.


కార్యాలయానికి రాకుండానే..

మున్సిపల్ కార్యాలయానికి రాకుండానే ఇంటి నుంచే అన్నిరకాల సేవలు పొందేలా సిటిజన్ బల్దీ, స్వచ్ఛత ప్రత్యేక యాప్‌లను రూపొందించారు. వీటి కింద ఆన్‌లైన్‌లో నల్లా, ఆస్తి పన్నులు చెల్లించడంతో పాటు ఇతర రకాల సమస్యలు, ఫిర్యాదులు చేసుకోవచ్చు. దీంతో మరో ప్రత్యేకంగా యాప్ తయారు చేసే ఆలోచనలో మున్సిపల్ శాఖ అధికారులు ఉన్నారు. ఇప్పటికే పురపాలక శాఖ ద్వారా రెండు యాప్‌లు ఉండగా మూడో యాప్ ఎందుకని అభిప్రాయం వ్యక్తం కావడంతో దీని నుంచి లింక్ తీసుకొని ప్రజలకు సత్వర సేవలు అందించేలా చర్యలు చేపట్టాలని మున్సిపల్ శాఖ చెందిన ఉన్నతాధికారులు భావిస్తున్నారు. అయితే స్వచ్ఛత, బల్దీ యాప్‌లలో నమోదైన పూర్తి వివరాలను సంబంధిత అధికారులకు చేరవేసే నిర్దేశిత గడువులోగా పని పూర్తయ్యేలా స్మార్ట్ సిటీ కమాండ్ కంట్రోల్ విభాగం పర్యవేక్షణ చేసేలా చేయాలని భావిస్తున్నారు. ప్రజలు కార్యాలయానికి రాకుండానే సులువుగా పౌరసేవలు పొందేలా మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తోంది.

అందించే పౌరసేవలు

- ఆస్తి పన్ను మదింపు, ఆస్తి పన్ను పునఃసమీక్ష కోసం దరఖాస్తు, అప్పీల్, ఖాళీ స్థలంపై పన్ను మదింపు.
- నల్లా కనెక్షన్, వ్యాపార లైసెన్స్ పునరుద్ధరణ, పేరు మార్పిడి, భవన అనుమతి ధ్రువీకరణ పత్రం.
- మాస్టర్ ప్లాన్ ప్రకారం భూమి వినియోగ, జనన–మరణ ధ్రువీకరణ పత్రం పొందుట.
- జనన ధ్రువీకరణ పత్రంలో శిశువు పేరు చేర్చుట, పేరు సరిదిద్దుట.
- మరణ ధ్రువీకరణ పత్రం పేరు మార్పిడి లేని పక్షంలో ధ్రువీకరణ పత్రం ఇవ్వడం.
- విద్యా సంస్థల పారిశుద్ధ్య ధ్రువీకరణ పత్రం తీసుకోవడం లాంటి సేవలను ఈ సిటిజన్ సెంటర్ ద్వారా పొందవచ్చు.

అంకితభావంతో పనిచేస్తేనే మంచి గుర్తింపు



బదిలీ అయిన ఎస్‌ఐలను సన్మానిస్తున్న ఎస్పీ రాజేంద్ర ప్రసాద్

- ఎస్పీ రాజేంద్ర ప్రసాద్

హుజూర్‌నగర్: అంకితభావంతో కష్టపడి పనిచేసిన వారికి సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. నియోజకవర్గంలో ఇటీవల బదిలీ అయిన ఎస్‌ఐలకు శనివారం హుజూర్‌నగర్‌లో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు పోలీస్ ఉద్యోగులు కేసుల విషయంలో ప్రజలను సమన్వయం చేసుకుని మంచి ఫలితాలు రాబట్టాలన్నారు. నియోజకవర్గంలో పలు క్రిటికల్ కేసుల ఛేదనలో ఉద్యోగులు చూపిన చొరవ అభినందనీయమన్నారు. ఎక్కడ పని చేసినా శాఖకు గుర్తింపు తేవాలని సూచించారు. అనంతరం బదిలీ అయిన ఎస్‌ఐలను శాలువా పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్‌రెడ్డి, సీఐ రామలింగారెడ్డి, స్థానిక ఎస్‌ఐలు హరిప్రసాద్, బదిలీ అయిన ఎస్‌ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో జూనియర్ లైన్‌మెన్ మృతి

భువనగిరి: విద్యుదాఘాతంతో జూనియర్ లైన్‌మెన్ మృతిచెందిన ఘటన శనివారం భువనగిరి పట్టణంలోని సబ్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు పట్టణానికి చెందిన సుంకరి రామకృష్ణ(32) భువనగిరి పట్టణంలో జూనియర్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. భువనగిరి సబ్ స్టేషన్ పరిధిలోని ఓ ఏరియాలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో శనివారం ఉదయం సబ్ స్టేషన్‌లో ఉన్న ఫీడర్ వద్ద మరమ్మతులు చేసేందుకు వెళ్లాడు. మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే స్థానికులు గమనించి అతడిని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతుడికి భార్య భాగ్యలక్ష్మి, కుమారుడు, కుమార్తెలు ఉన్నారు. కాగా అధికారుల నిర్లక్ష్యంతోనే తన భర్త మృతిచెందాడని భువనగిరి పోలీస్ స్టేషన్‌లో మృతుడి భార్య ఫిర్యాదు చేసింది.

బాలికను అపహరించిన యువకుడి రిమాండ్

గుండాల: బాలికకు మాయమాటలు చెప్పి ఇంట్లో నుంచి అపహరించి పెళ్లి చేసుకున్న యువకుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన గుండాల మండలంలోని మాసాన్‌పల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాసాన్‌పల్లి గ్రామానికి చెందిన పాలడుగు రాజశేఖర్ అదే గ్రామానికి చెందిన బాలికను మాయమాటలు చెప్పి ఈ నెల 5వ తేదీన ఇంట్లో నుంచి తీసుకెళ్లి మహబూబాబాద్ జిల్లా నెక్కొండలో వివాహం చేసుకున్నాడు. బాలిక తల్లిదండ్రులు అదే రోజు తమ కుమార్తె కనిపించడం లేదని గుండాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా శనివారం గుండాల పరిసర ప్రాంతాల్లో రాజశేఖర్‌ను అరెస్టు చేసి బాలికను ఆమె తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్‌ఐ యాకన్న తెలిపారు. నిందితుడిని భువనగిరి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించామని, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఇద్దరు బాలకార్మికులకు విముక్తి

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండల కేంద్రంలోని దుకాణాల్లో పనిచేస్తున్న ఇద్దరు బాలకార్మికులను ఆపరేషన్ ముస్కాన్ టీం శనివారం పోలీసులకు అప్పగించింది. పోలీసులు తెలి పిన వివరాల ప్రకారం.. ఆపరేషన్ ముస్కాన్ టీం ఎస్‌ఐ శంకరయ్య ఆధ్వర్యంలో శని వారం తిప్పర్తి మండల కేంద్రంలో బైక్ మెకానిక్, బ్యాటరీ షాపుల్లో పని చేస్తున్న ఇద్దరు బాల కార్మికులను అదుపులోకి తీసుకున్నారు. వీరిని తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. షాపు యజమానులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎన్. ధర్మా తెలిపారు.

మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని ధర్నా

- రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రైస్ మిల్లు డ్రైవర్ మృతి
- నార్కట్‌పల్లి– అద్దంకి రహదారిపై బంధువులు, కుటుంబ సభ్యుల రాస్తారోకో


సురేష్ (ఫైల్)


నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై రాస్తారోకో చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

వేములపల్లి: రైస్ మిల్లులో పనిచేసే డ్రైవర్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. కాగా మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని బంధువులు, కుటుంబ సభ్యులు రైస్ మిల్లు ఎదుట రాస్తారోకో చేపట్టారు. ఈ ఘటన వేములపల్లి మండలంలోని శెట్టిపాలెం గ్రామ శివారులో శనివారం చోటుచేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శెట్టిపాలెం గ్రామానికి చెందిన నక సురేష్(26) నాలుగు సంవత్సరాలుగా గ్రామ శివారులోని మహర్షి రైస్ మిల్లులో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 9వ తేదీన పని నిమిత్తం సురేష్ తన బైక్‌పై మిర్యాలగూడ నుంచి శెట్టిపాలెంకు వెళ్తుండగా మిర్యాలగూడ శివారులోని ఏడుకోట్లతండా సమీపంలో బైక్‌ను డీసీఎం ఢీకొట్టింది. దీంతో సురేష్ రోడ్డుపై పడిపోగా అతడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతదేహానికి శనివారం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం బంధువులు మృతదేహాన్ని శెట్టిపాలెం గ్రామానికి తీసుకెళ్తూ మహర్షి రైస్ మిల్లు ఎదుట ఆగి మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని మిల్లు యాజమాన్యాన్ని కోరగా.. వారు స్పందించలేదు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై సుమారు గంటపాటు రాస్తారోకోకు దిగారు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడడంతో వేములపల్లి, మాడుగులపల్లి ఎస్‌ఐలు శ్రీను, నాగరాజు తమ సిబ్బందితో అక్కడికి చేరుకొని మిల్లు యాజమాన్యంతో మాట్లాడి మృతుడి కుటుంబ సభ్యులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. కాగా సురేష్‌కు గత డిసెంబర్‌లో భద్రాచలం జిల్లా ఎలిపాకకు చెందిన తన మేనత్త కుమార్తె నాగలక్ష్మితో వివాహం జరగగా, ఆమె ప్రస్తుతం గర్భవతిగా ఉంది. సురేష్ మృతితో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

యాదాద్రి కొండపై సెల్‌ఫోన్ దొంగ అరెస్ట్


దొంగను అదుపులోకి తీసుకున్న పోలీసులు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సెల్‌ఫోన్ల చోరీకి పాల్పడుతున్న యువకుడిని స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఎస్పీఎఫ్) పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఎస్పీఎఫ్ పోలీసులు, సెల్‌ఫోన్ భద్రపరిచే కౌంటర్ నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్‌కు చెందిన పవన్ కుమార్ శనివారం మధ్యాహ్నం 12.45 గంటల సమయంలో యాదాద్రి కొండ పైన సెల్‌ఫోన్‌లు భద్రపరిచే కౌంటర్ లోపలికి ప్రవేశించాడు. అందులో ఉన్న సిబ్బంది దృష్టి మరల్చి కౌంటర్‌లో ఉన్న సుమారు రూ.2.50లక్షల విలువ చేసే రెండు యాపిల్ ఐఫోన్లను జేబులో పెట్టుకొని అక్కడి నుంచి దర్శనానికి వెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత ఐఫోన్లు భద్రపరిచిన భక్తుడు వచ్చి కౌంటర్ వద్ద అడిగే సరికి అక్కడ ఫోన్లు కనిపించలేదు. దీంతో అప్రమత్తమైన సెల్‌ఫోన్ కౌంటర్ సిబ్బంది వెంటనే ఎస్పీఎఫ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి సీసీ కెమెరాలను పరిశీలించి ఆలయ పశ్చిమ రాజగోపురం వద్ద నుంచి బయటకు వస్తున్న పవన్ కుమార్‌ను పట్టుకొని విచారించగా.. ఫోన్లు దొంగిలించింది తానేనని నిజం ఒప్పుకున్నాడు. నిందితుడి వద్ద నుంచి ఐఫోన్లను స్వాధీనం చేసుకొని, యాదగిరిగుట్ట పట్టణ పోలీసులకు అప్పగించారు.

అన్నదమ్ముల మధ్య భూమి పంచాయితీ

- గడ్డిమందు తాగిన అన్న
- నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స

రామగిరి(నల్లగొండ): అన్నదమ్ముల మధ్య జరిగిన భూతగాదాలో అన్న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన శుక్రవారం తిప్పర్తి మండలంలోని కంకణాలపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. కంకణాలపల్లి గ్రామ సర్పంచ్ కోన జానయ్య, అతడి అన్న కోన లక్ష్మయ్య మధ్య గత కొంతకాలంగా భూతగాదాలు జరుగుతున్నాయి. తండ్రి లింగయ్య నుంచి వారసత్వంగా వచ్చిన ఎకరం ప్రభుత్వ భూమిని కోన లక్ష్మయ్య గత 30 సంవత్సరాలుగా సాగు చేస్తున్నాడు. ఇదే విషయమై ఏడాది కాలంగా వీరిద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఆ ఎకరం భూమి తనదేనంటూ గత 10 రోజులుగా జానయ్య దానిని సాగు చేయడానికి ప్రయత్నిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ట్రాక్టర్ సహాయంతో దున్నడానికి వెళ్లాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న లక్ష్మయ్య జానయ్యను అడ్డుకునే క్రమంలో ఇద్దరి మధ్య తోపులాట జరిగింది. దీంతో లక్ష్మయ్య అక్కడే ఉన్న గడ్డి మందును తాగాడు. కుటుంబ సభ్యులు నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. లక్ష్మయ్య కుమార్తె రేణుక శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై ఎస్‌ఐ ఎన్. ధర్మాను వివరణ కోరగా.. భూ వివాదం కోర్టులో ఉంది కాబట్టి కోర్టులోనే తేల్చుకోవాలని తెలిపారు.

ఎక్సైజ్ పోలీసుల దాడులు

- 800 కిలోల బెల్లం, 10 కిలోల పటిక, 5 లీటర్ల నాటుసారా స్వాధీనం


సారా తయారీదారుడిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ అధికారులు

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మండలంలోని ఐలాపురంతండాలో శుక్రవారం రాత్రి ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఐలాపురంతండాకు చెందిన బాణావత్ వెంకటేశ్వర్లు ట్రాక్టర్ ట్రాలీలో దాచి ఉంచిన 800 కిలోల బెల్లం, 10 కిలోల పటిక, 5 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు నిందితుడిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎస్‌ఐలు డి. రామకృష్ణ, పర్వీన్, లావణ్య, హెడ్ కానిస్టేబుల్ సుభాష్, సిబ్బంది నరేష్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

ఆటోలు చోరీ చేస్తున్న దొంగ అరెస్ట్

నల్లగొండ క్రైం: ఆటోలు చోరీ చేస్తున్న దొంగను అరెస్టు చేసి అతడి వద్ద నుంచి ఆరు ఆటోలను స్వాధీనం చేసుకున్నట్లు నల్లగొండ టూటౌన్ పోలీసులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణంలోని మీర్‌బాగ్ కాలనీకి చెందిన రఫీక్ అహ్మద్ జూన్ 22న రాత్రి తన ఆటోను ఇంటి ముందు పార్కింగ్ చేయగా, మరుసటి రోజు ఉదయం లేచి చూసేసరికి ఆటో కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణలో భాగంగా హైదరాబాద్‌లో మహ్మద్ సలీం అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా.. తన సొంత అల్లుడు సయ్యద్ సమీర్ అలియాస్ నవాజ్‌తో కలిసి మొత్తం ఎనిమిది ఆటోలు దొంగతనం చేసినట్లు అంగీకరించాడు. అతడి నుంచి 6 ఆటోలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలి పారు. సమీర్ పరారీలో ఉన్నాడని వారి నుంచి మరో 2 ఆటోలు రికవరీ చేయాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ కేసును ఛేదించిన ఎస్‌ఐలు నాగరాజు, సంపత్, పోలీసు సిబ్బంది శంషుద్దీన్, శంకర్, బాలకోటిని డీఎస్పీ నర్సింహారెడ్డి, సీఐ పీఎన్‌డీ ప్రసాద్ అభినందించారు.

శ్మశానవాటిక స్థలంపై వివాదం

- అంత్యక్రియలను అడ్డుకున్న దంపతులు


వివాదాస్పదమైన స్థలంలో అంత్యక్రియలు నిర్వహిస్తున్న మృతుడి బంధువులు, స్థానికులు

భువనగిరి: పట్టణంలోని కిసాన్‌నగర్ అండర్‌పాస్ బ్రిడ్జి సమీపంలో గల ఓ స్థలంలో శనివారం స్థానిక అర్బన్ కాలనీకి చెందిన వ్యక్తి అంత్యక్రియలు నిర్వహించడం వివాదానికి దారి తీసింది. కొన్ని సంవత్సరాలుగా శ్మశానవాటికగా కొనసాగుతున్న ఆ స్థలాన్ని ఇటీవల సులోచన, ఆగిరెడ్డి దంపతులు తమకు వారసత్వంగా వచ్చిన ఆస్తిగా పేర్కొంటూ అందులోని కొన్ని సమాధులను తొలగించి చదును చేస్తున్నారు. ఈ క్రమంలో అర్బన్ కాలనీకి చెందిన వ్యక్తి శనివారం మృతిచెందడంతో బస్తీవాసులు అంత్యక్రియలు చేసేందుకు మృతదేహాన్ని ఆ స్థలం వద్దకు తీసుకొచ్చారు. అప్పటికే అక్కడ ఉన్న సులోచన, ఆగిరెడ్డి అంత్యక్రియలను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో శ్మశానవాటిక స్థలాన్ని ఎలా కబ్జా చేస్తారంటూ స్థానిక నాయకులు కృష్ణ, చెన్న మహేష్, అంగడి నాగరాజు, కడారి వినోద్, ఎడమ ప్రవీణ్‌తో పాటు పలువురు వారిని నిలదీశారు. తమకు వారసత్వంగా వచ్చిన ఆ భూమికి సంబంధించిన అన్ని హక్కు పత్రాలు ఉన్నాయని అంత్యక్రియలు చేయవద్దంటూ వాదనకు దిగారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొనడంతో పోలీసుల రంగప్రవేశం చేసి అదే స్థలంలో అంత్యక్రియలు పూర్తిచేయడంతో వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది.

మర్యాల సర్పంచ్‌పై కేసు నమోదు

బొమ్మలరామారం: వ్యక్తిపై దాడి చేసినందుకు గాను బొమ్మలరామారం మండలంలోని మర్యాల గ్రామ సర్పంచ్ కుర్మిండ్ల దామోదర్‌గౌడ్‌పై శనివారం కేసు నమోదు అయ్యింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మర్యాల గ్రామానికి చెందిన ప్యారారం రాజుకు గ్రామ సర్పంచ్ కుర్మిండ్ల దామోదర్‌గౌడ్‌కు గ్రామంలోని శివాలయం వద్ద ఓ స్కూల్ బస్సు పార్కింగ్ విషయంలో శుక్రవారం గొడవ జరిగింది. ఈ క్రమంలో శనివారం ఇరువురు ఎదురుపడగా మాటామాట పెరిగి ఘర్షణ పడ్డారు. కాగా తన కుమారుడు రాజుపై సర్పంచ్ దామోదర్ గౌడ్ దాడి చేసి గాయపరచడంతో పాటు తనను బూతులు తిట్టాడని పోలీసులకు రాజు తల్లి లలిత ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ట్రైనీ ఐపీఎస్ అధికారి శివం ఉపాధ్యాయ సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేశారు. సర్పంచ్ కుర్మిండ్ల దామోదర్‌పై 324 సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ శంకర్‌నాయక్ తెలిపారు. రాజును చికిత్స నిమిత్తం భువనగిరి జిల్లా ఆస్పత్రికి తరలించారు.

కల్తీ పాలు స్వాధీనం.. పాల వ్యాపారిపై కేసు


కల్తీ పాలతో పట్టుబడిన నిందితుడు

భూదాన్‌పోచంపల్లి: మున్సిపాలిటీ పరిధిలోని సీతావానిగూడెం గ్రామంలో శనివారం పోలీసులు కల్తీ పాలను స్వాధీనం చేసుకొని పాల వ్యాపారిపై కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ విక్రమ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సీతావానిగూడెం గ్రామానికి చెందిన బొంగు కిరణ్ పాల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అధిక లాభార్జనే ధ్యేయంగా పాలను కల్తీ చేసి విక్రయిస్తున్నాడు. శనివారం పాల పౌడర్‌తో కల్తీ పాలను తయారు చేసి వాహనంలో హైదరాబాద్‌లో విక్రయించడానికి వెళ్తుండగా పోలీసులు ఆకస్మికంగా దాడి చేసి 50 లీటర్ల కల్తీ పాలు, 5 పాల ప్యాకెట్లు, మహేంద్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కిరణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని భర్త ఆత్మహత్య

నల్లగొండ క్రైం: భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి రావడం లేదని భర్త ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన నల్లగొండ పట్టణంలోని సాయిశ్రీ కాలనీలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయిశ్రీ కాలనీ రోడ్ నంబర్-4లో నివాసముంటున్న మీర్జా నజీర్ బేగ్(48)కు భార్య నౌసీన్, కుమారుడు, కుమార్తె ఉన్నారు. నాలుగు నెలల క్రితం నౌసీన్ కుమారుడు, కుమార్తెను తీసుకొని తన తల్లిగారి ఇంటికి వెళ్లింది. అప్పటి నుంచి భర్త నజీర్ బేగ్ ఎన్నిసార్లు ఫోన్ చేసినా సమాధానం ఇవ్వడం లేదు. దీంతో మనస్తాపానికి గురైన నజీర్ బేగ్ ఇంట్లో శనివారం ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని నల్లగొండ టూటౌన్ పోలీసులు తెలిపారు.

మట్టపల్లి ఆలయంలో శని త్రయోదశి పూజలు


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మఠంపల్లి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి క్షేత్రంలోని శివాలయంలో శనివారం శని త్రయోదశిని పురస్కరించుకుని శనీశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తైలాభిషేకం సమర్పించారు. కేవలం శనివారం నాడు వచ్చే త్రయోదశి తిథిలోనే శనికి తైలాభిషేకం నిర్వహించడం ఆనవాయితీ అని అర్చకులు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో వచ్చి శ్రీస్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రధానాలయంలో శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం స్వామిఅమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సం జరిపారు. ఆ తర్వాత కల్యాణం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక చైర్మన్ చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, దుర్గాప్రసాద్‌శర్మ, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, సీతా రామాచార్యులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

హుజూర్‌నగర్ (చింతలపాలెం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా నందిగామ ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుకను తీసుకొస్తున్న టిప్పర్‌ను చింతలపాలెం మండలంలోని గుడిమల్కాపురం గ్రామ శివారులో శనివారం పోలీసులు పట్టుకున్నారు. టిప్పర్‌ను సీజ్ చేసి, డ్రైవర్ నెమలి గోపిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ హరీష్‌రెడ్డి తెలిపారు.

అన్నదమ్ముల మధ్య భూవివాదం.. రిమాండ్

అడ్డగూడూరు: భూవివాదంలో గొడ్డళ్లతో దాడి చేసుకున్న అన్నదమ్ములను శనివారం రిమాండ్ చేసినట్లు అడ్డగూడూరు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డగూడూరు మండల పరిధిలోని మానాయికుంట గ్రామానికి చెందిన మార్త వీరయ్య, మార్త సైదులు సొంత అన్నదమ్ములు. గత కొంతకాలంగా వీరి మధ్య భూవివాదం కొనసాగుతుండగా.. జూన్ 7న ఒకరిపై ఒకరు గొడ్డళ్లతో దాడి చేసుకున్నారు. దీంతో ఇరువురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసిన పోలీసులు శనివారం వారిని అరెస్టు చేసి రిమాండ్ చేసి నల్లగొండ జైలుకి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అదుపుతప్పి బైక్‌ను ఢీకొట్టిన కారు

- ఒకరికి గాయాలు

కట్టంగూర్: మండలంలోని ముత్యాలమ్మగూడెం సమీపంలో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ముత్యాలమ్మగూడెం గ్రామానికి చెందిన మేకల శంకర్ బైక్‌పై జాతీయ రహదారి గుండా చిన్నపురి గ్రామం వైపు తన చెల్క వద్దకు వెళ్తున్నాడు. అదే సమయంలో విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు టైరు పగలడంతో అదుపుతప్పి వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న శంకర్ ఎగిరి రోడ్డు పడటంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న శంకర్ కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించారు.

న్యాయం చేయాలి

సూర్యాపేట: జీఓ నంబర్ 46ను రద్దు చేసి తమకు న్యాయం చేయాలని జిల్లాలోని గ్రామీణ ప్రాంత పోలీస్ అభ్యర్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం వారు జీఓ 46ను నిరసిస్తూ సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. జీఓ నంబర్ 46 వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఉండి అర్హత సాధించి రాష్ట్రస్థాయిలో నియమించే (టీఎస్ఎస్పీ) ఉద్యోగాల్లో కేవలం ఉమ్మడి హైదరాబాద్ జిల్లాకు 53శాతం రిజర్వేషన్ కల్పించి మిగతా 26 జిల్లాలకు 47శాతం కేటాయించడంతో తమకు అన్యాయం జరుగనుందన్నారు. జిల్లాకు 6శాతం అనగా 134 పోస్టులు కల్పించి తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వేణు రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కంటెయినర్

- ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు
- నార్కట్‌పల్లి మండల కేంద్రం శివారులో ఘటన

నార్కట్‌పల్లి: బైక్‌పై వెళ్తున్న యువకులను వెనుక నుంచి కంటెయినర్ ఢీకొట్టడంతో ఒకరు మృతిచెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం నార్కట్‌పల్లి మండల కేంద్రం శివారులో చోటు చేసుకుంది. స్థానిక ఎస్‌ఐ సైదాబాబు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన గుంటి మనోజ్, హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన కొనగంటి మధుకిరణ్(20) నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడ సమీపంలో గల మహాత్మాగాంధీ యూనివర్సిటీలో బీటెక్ చదువుతున్నారు. ఇరువురు కలిసి శనివారం నార్కట్‌పల్లి నుంచి యూనివర్సిటీ వైపు బైక్‌పై వెళ్తుండగా అద్దంకి-నార్కట్‌పల్లి రోడ్డులో నార్కట్‌పల్లి మండల కేంద్రం శివారులో వెనుక నుంచి కంటెయినర్ లారీ వచ్చి ఢీకొట్టింది. దీంతో మధుకిరణ్ రోడ్డుపై పడిపోగా కంటెయినర్ అతడి మీద నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మనోజ్ రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మధుకిరణ్ మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి, గాయపడిన మనోజ్‌ను చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

శతాధిక వృద్ధుడు మృతి


కన్నయ్య (ఫైల్)

చిలుకూరు: మండల పరిధిలోని నారాయణపురం గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ తమ్మనబోయిన శ్రీనివాస్‌రావు తండ్రి తమ్మనబోయిన కన్నయ్య(101) శనివారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన మృతి పట్ల కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, బీఆర్‌ఎస్ పార్టీ కోదాడ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి కె. శశిధర్‌రెడ్డి, సర్పంచ్ తమ్మనబోయిన శంకర్, ఎంపీటీసీ మండవ శైలజచిన్నాతో పాటు పలు పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న క్రూజర్

- ఇద్దరు తోడల్లుళ్లు మృతి

యాచారం: నాగార్జునసాగర్- హైదరాబాద్ రహదారిపై రంగారెడ్డి జిల్లా పరిధిలోని మాల్ మండల కేంద్రం వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన తోడల్లుళ్లు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం తిరుగండ్లపల్లి గ్రామానికి చెందిన నారోజ్ శాల్వాచారి(45), మహబూబ్‌నగర్ జిల్లా మణిగల్ల గ్రామానికి చెందిన వీరబ్రహ్మాచారి(50) తోడల్లుళ్లు. వీరు నగరంలో ఉంటూ కార్పెంటర్లుగా పనిచేస్తున్నారు. శనివారం మధ్యాహ్నం బైక్‌పై తిరుగండ్లపల్లికి వచ్చి.. తిరిగి హైదరాబాద్‌కు వెళ్తుండగా రాత్రి 8 గంటల సమయంలో మాల్ మండల కేంద్రం వద్ద యాచారం వైపు నుంచి ఎదురుగా వచ్చిన క్రూజర్ వాహనం వీరి బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన వీరబ్రహ్మాచారి అక్కడికక్కడే మృతిచెందగా.. శాల్వాచారిని స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నల్లగొండ క్రైం: పట్టణంలోని దేవరకొండ రోడ్డులో గల టీవీఎస్ షోరూం వద్ద శనివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు వన్ టౌన్ సీఐ గోపి తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 35 నుంచి 40 సంవత్సరాలు ఉంటాయని, ఎరుపు రంగు చొక్కా, నల్ల రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని సీఐ పేర్కొన్నారు. రోడ్డ పక్కన పడిపోయి ఉన్న వ్యక్తిని స్థానికులు గమనించి 108 సిబ్బంది సమాచారం ఇవ్వడంతో వారు వెళ్లి చూసేసరికి అతడు మృతిచెందినట్లు వివరించారు. మృతదేహాన్ని నల్లగొండ జిల్లా కేంద్రం ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారని, మృతుడి వివరాలు తెలిసిన వారు వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

‘ఉపా’ చట్టాన్ని రద్దుచేయాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ‘ఉపా’ చట్టాన్ని రద్దు చేయాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉదయగిరి, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం. డేవిడ్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు డిమాండ్ చేశారు. శనివారం అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశములో వారు మాట్లాడారు. మోదీ ప్రభుత్వం ప్రజా ఉద్యమకారులను నిరంకుశత్వంగా అణచివేయడానికి ఎన్ఐఏతో ఉపా చట్టాన్ని ఉపయోగిస్తోందని వాపోయారు. రాజ్యాంగానికి విరుద్ధంగా ఉపా చట్టాన్ని తేవడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టులాంటిదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో కూడా 152 మందికిపైగా ఎలాంటి ఆధారాలు లేకుండా, చివరికి చనిపోయిన వారిపై కూడా దేశద్రోహ కేసులు నమోదు చేయడం దుర్మార్గమన్నారు. ఉపా చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని లేని పక్షంలో అన్ని సంఘాలతో ఏకమై ఉద్యమిస్తామని హెచ్చరించారు. అరుణోదయ జిల్లా ప్రధాన కార్యదర్శి కంచనపల్లి సైదులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీపీఐ (ఎంఎల్)రాష్ట్ర నాయకులు బుద్ధ సత్యనారాయణ, బీసీపీ జిల్లా కార్యదర్శి చామకూరి నర్సయ్య, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు అవుల నాగరాజు, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు నాగేందర్, కోటయ్య, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ ప్రచార కమిటీ మెంబర్‌గా నాగన్నగౌడ్



హుజూర్‌నగర్: తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా హుజూర్‌నగర్‌కు చెందిన యరగాని నాగన్నగౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నాగన్నగౌడ్ శనివారం హుజూర్‌నగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన పార్టీ అధిష్టానికి, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి, సీనియర్ నేతలు డాక్టర్ సంజీవరెడ్డి, మధుయాష్కీ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావటానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

బాల బాలికల సంరక్షణకు ప్రభుత్వం కృషి

రామగిరి(నల్లగొండ) : బాల బాలికల సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ అధికారి ఎస్.విద్య పేర్కొన్నారు. శనివారం తిప్పర్తిలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి బాలల పరిరక్షణ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. 6 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల బాలికల కోసం బాల సదనం నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. అనాథ పిల్లలకు ఆశ్రయం కల్పించేందుకు ప్రభుత్వేతర సంస్థలు కూడా పని చేస్తున్నాయన్నారు. హెచ్ఐవీ చిన్నారులకు మిషన్ వాత్సల్య పథకం ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.సునీత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడి సస్పెన్షన్

నిడమనూరు: మండలంలోని ముప్పారం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కె.కోటయ్యను డీఈఓ భిక్షపతి సస్పెండ్ చేసినట్లు ఎంఈఓ బాలునాయక్ శనివారం తెలిపారు. కోటయ్యపై అతని భార్య శైలజ కేసు పెట్టడంతో, కేతేపల్లి పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. జూన్ 28న కేసు నమోదు చేసిన పోలీసులు 29న అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల సమాచారం మేరకు కోటయ్యను సస్పెండ్ చేస్తూ డీఈఓ ఉత్తర్వులు జారీ చేశారన్నారు.